

# (అ)న్యాయం

## చంద్రం

'సెంద్రిగాడి పెళ్ళాం కనిపించటం లేదు.'

ఆకాశవాణి కేంద్రాలు ప్రసారం చెయ్యలేదు. వార్తాపత్రికలు ప్రచురించ లేదు. అంచేత ఈ వార్త నలుగురికీ తెలిసే అవకాశం లేకపోయింది. తెలుసుకోవలసిన అవసరమూ ఎవ్వరికీ లేకపోయింది.

వార్తల్లో ఎక్కటానికి అవసరమయ్యే అర్హతల్లో ఏ ఒక్కటీ లేని సెంద్రిగాడు— నల్లగా బొద్దుగా నిగనిగలాడుతూ తుమ్మ మొద్దులా వుంటాడు. అసలు పేరు చంద్రయ్య. స్పష్టంగా పిలవగలిగిన వాళ్ళు 'చంద్రయ్య' అంటారు. 'చంద్రయ్యగా'డంటారు. నీపేరేంటోయ్!— అని వాణ్ణే అడిగితే 'సెందరయ్యండి' అంటాడు. ఎవరేవిధంగా పిలిచినా, పిలుస్తున్నది తననే అని తెలిస్తే, తప్పకుండా పలుకుతాడు చంద్రయ్య.

"రాత్రి రొండో ఆట సినిమాకెళ్తానని సెప్పి ఎల్లిన సుక్కమ్మ యింతవరకు తిరిగి రాలేదు!" అని రెండోరోజు మధ్యాహ్నం సీతమ్మతో మొరపెట్టు కున్నాడు చంద్రయ్య.

'సుక్కమ్మ' అంటే ఎవరో కాదు - చంద్రయ్య పెళ్ళామే.

చుక్కమ్మ చక్కని చుక్కలా వుండకపోయినా, కనుముక్కు తీరులో లోపంలేదు. ఒంటిరంగు నలుపే అయినా చంద్రయ్యంత కాకినలుపు కాదు. తను మాత్రం కండపుష్టితో, యిరవయ్యేళ్ళ యవ్వనంలో పిటపిటలాడుతూ వున్న చుక్కమ్మ— తల చిక్కు తీసి, జడవేసి, వుతికిన చీరకట్టి, గుత్తంగా రవిక తొడుక్కుంటే చూపరుల దృష్టి ఒక్కింత చెదరకమానదు.

చంద్రయ్య చెప్పిన రిపోర్టు విని అంతెత్తున లేచింది సీతమ్మ—"ఆ మాట చెప్పటానికి సిగ్గులేదురా సెందిరిగా? అదొక్కరితే రొండో ఆటకెల్తానంటే నువ్వెలా గెల్లనిచ్చినావురా? పెళ్ళాన్ని ఏలుకోటం చాతకాని ఆడంగి ఎదవా! నీకు పెళ్ళిసెయ్యటం నాదే బుద్ధితక్కువరా సచ్చినోడా!"

సీతమ్మ మాటల్లో కోపం వుంది. అంతకుమించి బాధా వుంది.

సీతమ్మ చంద్రయ్యకేమవుతుంది? అన్న ప్రశ్నకు ఏమీకాదు అన్నది సరైన సమాధానం. మరలాంటప్పుడు తన పెళ్ళాం రెండోఆట సినిమాకెళ్ళి తిరిగి రాని సంగతి సీతమ్మకెందుకు మొర పెట్టుకున్నాడు చంద్రయ్య?- అంటే- సీతమ్మ తప్ప తన గోడు వినటానికి మరొకరెవ్వరూ లేకపోవటమే కారణం.

శ్రీకాకుళం జిల్లానుండి కొన్ని కారణాలవల్ల పొట్ట చేతబట్టుకొని, కట్టు బట్టల్తో కృష్ణాజిల్లాకు వలసవచ్చినవాడు చంద్రయ్య. ఏనాడో భర్తను కోల్పోయి నా అనేవాళ్ళెవరూ లేక, మోడులా జీవిస్తున్నది సీతమ్మ. ఇద్దరూ కాకతాళీయంగా తారసపడ్డారు.

గంగిగోవులాంటి చంద్రయ్య పాతికేళ్ళ పడుచుదనంలో వున్నాడు.

యాభై దాటిన సీతమ్మ తన పరిధిలో జీవితాన్ని కాచి వడపోసింది.

సీతమ్మని సీతమ్మనే పిలుస్తాడు చంద్రయ్య.

చంద్రయ్యని సెంద్రిగా అని పిలుస్తుంది సీతమ్మ.

భాషకందని ఒకానొక అనుబంధం ఆ యిద్దరిమధ్యా ఏర్పడి, గట్టిపడి పోయింది. తెలియనివాళ్ళు ఆ యిద్దరినీ తల్లీ కొడుకులుగా భావించటం కద్దు.

తన ఎరుకలో, తన కందుబాటులో వున్న చుక్కమ్మ తల్లిదండ్రులతో మాట్లాడి, చంద్రయ్యకు పెళ్ళిచేసింది సీతమ్మ. తనుంటున్న ఒంటినిట్టాడి పాకలోనే తడిక అడ్డంపెట్టి ఒక గది ఏర్పాటుచేసి, అందులో వుంటూ కూలో నాలో చేసుకు బతకమంది.

"ఏమైపోయిందంటావు సీతమ్మా, సుక్కమ్మ?" అన్నాడు అమాయకంగా చంద్రయ్య.

"ఎవరితోనో లేచిపోయుంటాది," అనేసింది, సీతమ్మ కోపంగా.

ఆ మాట విని గతుక్కుమన్నాడు చంద్రయ్య.

"మరైతే యింక రాదంటావా?"

"ఓరి సచ్చినోడా!" అని కోపంగా అన్న సీతమ్మ తలెత్తి వాడి ముఖంలోకి చూసి, తర్వాత మాటలు అనలేక పోయింది. కోపాన్ని దిగమింగుకుంది గాని, దుఃఖం పెల్లుబికి కళ్ళల్లో నీళ్ళు తిరిగినయ్.

రెండు రోజుల క్రితం ఏదో పనిమీద వూరెళ్ళిన సీతమ్మ అప్పుడే దిగింది. వచ్చేటప్పటికి అరుగుమీద ముఖం వేలా దేసుకు కూచున్నాడు చంద్రయ్య.

ఇంత సత్తెకాలపు ఎదవ్వి ఎలా బతుకుతావురా నాయనా! — అనుకుంది మనసులోనే సీతమ్మ.

"రాత్తిర్నుంచీ యిలాగ ఏడుసుకొనే కూసున్నావా? ఏమైపోనాదో ఆరా తియ్యలేదా?"

"ఊరంతా ఎతికాను. ఎక్కడా కనపళ్ళేదు!"

"తిరనాళ్ళలో తప్పిపోయిన పిల్లనెతికి నట్టు ఊరంతా తిరిగి ఎతికావా? ఇంటికి దారి తెలవనంత చిన్నపిల్లనుకున్నావురా యింకా నీ పెళ్ళాం!"

చంద్రయ్య ఏమీ అనలేదు. ఏమీ అనకపోవటమే కాక, ఏమీ చెయ్యలేదని కూడా సీతమ్మకి తెలుసు. అందుకనే ఆ క్షణంలోనే నడుంకట్టి కార్యరంగం లోకి దూకింది.

"నేను లేనప్పుడు మీరేమన్నా గొడవ పడ్డారా?" అంది అనుమానంగా సీతమ్మ.

"లేదు" అన్నాడు చంద్రయ్య.

అయినా, ఎందుకైనా మంచిదని, తొలిప్రయత్నంగా పక్కఊళ్ళో వున్న చుక్కమ్మ పుట్టింటికి కబురుపెట్టింది. కాని, చుక్కమ్మ అక్కడికి వెళ్ళలేదని తెలిసింది. తర్వాత, నెమ్మదిగా, నేర్పుగా ఊళ్ళో వాకబు చెయ్యసాగింది.

నాలుగురోజులు గడిచిపోయినయ్.

చుక్కమ్మ జాడ తెలీలేదు.

సీతమ్మ మనసు పరిపరివిధాలా పోతోంది మధ్య మధ్య కీడు శంకిస్తోంది.

ఈ నాలుగు రోజులూ చంద్రయ్య కంటికి కునుకు లేదు. అన్నం సహించ లేదు. సీతమ్మ నయానా, భయానా కూడా చెప్పి చూసింది. గాని, ఫలితం లేకపోయింది. సీతావియోగంలోవున్న శ్రీరామచంద్రుడిలా, ఆ చిన్న అరుగు మీద కూచుని మౌనంగా దుఃఖించసాగాడు.

సుక్కమ్మంటే పేణం పిచ్చి సన్నాసికి! — అనుకుంది సీతమ్మ.

ఎలా అయితేనేం — ఐదోనాడు తెలిసింది చుక్కమ్మ జాడ.

ఊళ్ళోనే — కామయ్యగారి ఇంట్లో వుంది చుక్కమ్మ!

చుక్కమ్మ జాడ తెలిసినందుకు మొదట సంతోషించినా, ఆమె వున్న

చోటు తలచుకొని అపరిమితంగా భయ పడి పోయింది సీతమ్మ.

కామయ్యంటే ఎవరు? సీతమ్మ దృష్టిలో సాక్షాత్తు 'రావణాబ్రెమ్మే!'

సీతమ్మకు తెలిసిన రామాయణకథలో రాముడు దేవుడైతే, రావణుడు రాక్షసుడు. రాములవారి భార్య సీతమ్మవారిని రావణాబ్రమ్మ చెరపడితే, విడిపించి తెచ్చుకోవటానికి దేవుడైనా రాముడికే కష్టమై పోయింది. అలాంటిది కామయ్యబాబి నుండి చుక్కమ్మను రక్షించటం తనకు సాధ్యపడుతుందా? ఇంతకీ కామయ్య చుక్కమ్మను చెరపట్టాడా? లేక మరోటేదన్నా జరిగిందా? జరిగితే ఏమై వుంటుంది? వాకబులమీద వాకబులు చేసి, చెరపట్టటంలాంటిదే జరిగిందని గ్రహించింది సీతమ్మ.

ఇప్పుడేం చెయ్యాలి మరి?

కామయ్యంటే సామాన్యుడా? ఇరవై ఎకరాల పొలం - సాగుచెయ్యటానికి ట్రాక్టర్ - లంకంత కొంప - ఇంటినిండా బంగారం - దొడ్డినిండా పశువులు - నలుగురు పాలేళ్లు - నలభై యేళ్ళ వయసు - ఊళ్ళో పరపతి - ఆయనతో పేచీపడటం పొట్టేలు పర్వతాన్ని ఢీకొన్నట్టుగానే వుంటుంది. కాబట్టి లౌక్యంగానే కార్యం సాధించుకోవాలి.

ఉదయాన్నే లేచి, చంద్రయ్యను యింటివద్దే వుండమని చెప్పి, ధైర్యం కూడదీసుకొని రామయ్యగారి లోగిలివేపు బయల్దేరింది సీతమ్మ.

అప్పుడే కంచుగ్లాసుడు చిక్కని కాఫీ తాగి, త్రేపున తేన్చి, వరండాలో వాలు కుర్చీలో కూచుని, లంకాకు చుట్ట వెలిగించి గుప్పుగుప్పున పొగ వదులుతున్నాడు కామయ్య.

"దండాలు కామయ్యబాబూ!" అంది సీతమ్మ భయం భయంగానే. మరొకప్పుడైతే కామయ్యముందు అంతగా భయపడేది కాదు సీతమ్మ. ఇప్పటి పని అలాంటిది. ఏదోవిధంగా కార్యం సానుకూల పర్చుకోవాలన్నది ఆమె వుద్దేశ్యం. కార్యభారం ఆమెని శాసించింది.

'ఏమి'టన్నట్టు చూశాడు కామయ్య.

"బాబూ! మా సెంద్రిగాడి పెళ్ళం-సుక్కమ్మ -" మాటలు అందటంలేదు సీతమ్మకి.


విషయం అర్థమైంది రామయ్యకి. వంకర నవ్వొకటి నవ్వాడు. "నిన్ను రాయబారం పంపించాడా సెంద్రిగాడు?" అన్నాడు వ్యంగ్యంగా.

"లేదు బాబూ! నానే వచ్చాను." అంది కంగారుగా సీతమ్మ - యిందులో సెంద్రిగాడి తప్పేం లేదన్నట్టు.

"సెంద్రిగాడు నీకేమవుతాడు?"

"కొడుకులాటోడు బాబూ!"

"కొడుకులాటోడు అంటే - కన్న కొడుకు కాదా?"



"కాదు బాబూ !"

"అప్ప కొడుకా? చెల్లెలి కొడుకా?"

"రెండూ కాదు బాబూ !"

"మరి కొడుకెలా అయ్యాడు?" మరో వంకర నవ్వు.

'అది నీ కరదంకాదులేరా గొడ్డు మోతు సచ్చినోడా !' అని పైకి అనలేక పోయింది సీతమ్మ.

"ఇంతకీ నువ్వెందు కొచ్చినట్టు?" అన్నాడు కామయ్య అసలు విషయం లోకి వచ్చి.

"అదే బాబూ! సుక్కమ్మని "

"తీసుకెళ్ళాలని వచ్చావా?"

సీతమ్మ మాట్లాడలేదు.

"చుక్కమ్మ నా యింటికి వచ్చింది మళ్ళీ తిరిగిపోవటానిక్కాదు. తెలిసిందా?"

"తెలిసింది బాబూ !"

"ఇంకా నుంచున్నావేం మరి?"

"ఒక్కసారి సుక్కమ్మని సూసి, మాటాడుదామని "

"చుక్కమ్మ యిప్పుడు నా అధీనంలో

వుంది. దాని మంచిచెడ్డలన్నీ చూసేది నేనే. నువ్వేదన్నా మాట్లాడ దల్చు కుంటే నాతోనే మాట్లాడు." అంత వరకూ మామూలుగా మాట్లాడిన కామయ్యకి గబుక్కున తన అంతస్తు గుర్తొచ్చింది. వెంటనే "అయినా నా స్వంత విషయాల్లో జోక్యం చేసుకొన టానికి నువ్వెవరు? వెళ్ళు వెళ్ళు." అంటూ చీదరించుకున్నాడు.

"ఎల్తాను బాబూ! ఎల్తాను," అంటూ గబ గబా మెట్లుదిగిపోయింది సీతమ్మ.

వ్యవహారం ఆదిలోనే బెడిసికొట్టి నందుకు సీతమ్మ విచారించలేదు. అది అంత తేలిగ్గా తీరిపోయే సమస్య కాదని ఆమెకి ముందే తెలుసు. కామయ్య అలా మాట్లాడినందుకు ఆమె ఎంత మాత్రం బాధపడలేదు. అంతకన్న బాగా మాట్లాడతాడని, మాట్లాడగలడనీ ఆమె ఎన్నడూ వూహించలేదు. అయితే, చుక్కమ్మతో మాట్లాడాలన్న తన ప్రయత్నం విఫలమైపోయినందుకు ఆమె చాలా నిరుత్సాహపడింది.

చుక్కమ్మ యిష్టపూర్వకంగానే వెళ్ళిందా?

లేక కామయ్య బలవంతంగా యింట్లో బంధించాడా?

ఇరవైయేళ్ళ చుక్కమ్మ నలభై దాటిన కామయ్యను కోరి బుద్ధిపూర్వ కంగానే వెళ్ళిందనుకోవటానికి మనసొప్పలేదు సీతమ్మకి.

కామయ్య భయపెట్టో, బలవంత పెట్టో, నగలూ డబ్బు ఆశ చూపించో లొంగదీసుకొని వుండాలి.

చుక్కమ్మతో మాట్లాడితే అసలు సంగతి తెలిసి వుండును.

అయితే కామయ్యలాంటి ఆస్తి పరుడికి చుక్కమ్మే కావాల్సి వచ్చిందా? అన్నదో ప్రశ్న కాలేదు సీతమ్మకి. ఆ ఊళ్ళో కామయ్యగారి కథలు తెలీని వారెవ్వరూ లేరు.

వివాహం కాకపూర్వమే గొప్ప రసికుడిగా పేరు ప్రఖ్యాతులు గడించాడు కామయ్య. వివాహమైన తర్వాత కూడా అయన కామ కార్యకలా పాలకి అంతరాయం కలగలేదు. ఆయన భార్య గొప్ప యిల్లాలు. పంచమహా పతివ్రతల సరసన జేర్చవలసి నంతటి పతిభక్తి పరాయణ! ఆ విషయం తెలీక మొదట్లో కాస్త చాటుమాటుగా తిప్పలు పడ్డాడు కామయ్య. తెలుసుకున్న తర్వాత తిన్నగా యింటికే తీసుకురావటం ప్రారంభించాడు. భర్త ఎంతమంది ముండల్ని యింటికి తెచ్చినా, ఇదేమిటని అడిగిన పాపానికి పోలేదు ఆ పతివ్రతా శిరోమణి!

ఎంతమంది ముండల్ని తెచ్చినా, ఎవ్వర్నీ శాశ్వతంగా వుంచుకోలేదు కామయ్య. అసలలాంటి పాడు వుద్దేశం అతని కెప్పుడూ లేదు. సరుకును బట్టి, అవసరాన్నిబట్టి నాలుగురోజులు అటూ

యిటూ అంతే. ఎప్పటి కప్పుడే కొత్త రుచుల మీదికి దృష్టిపోతుం దతనికి. ప్రబంధకవులైతే పువ్వు పువ్వుకు తిరిగి తేనెలు రుచిచూసే మగ తుమ్మెదతో పోల్చి వుందురేమో కామయ్యను. రసికావతంస, శృంగార కళానిధి, కామవిద్యా ప్రవీణ, కామినీ మానసచోర వగైరా బిరుదులు కూడా లభించి ఉండేవి. దురదృష్టవశాత్తు కాస్త లేటుగా ఈ శతాబ్దంలో పుట్టాడు.

కపివీరుల్ని నేలనాలుగు దిక్కులకూ పంపి, సీతమ్మ గురించిన వర్తమానం కోసం వేయి కన్నులతో ఎదురు చూస్తున్న శ్రీరామచంద్రమూర్తిలా సీతమ్మ రాకకోసం ఎదురు తెన్నులు చూస్తున్నాడు చంద్రయ్య.

సీతమ్మ వచ్చింది.

చుక్కమ్మ రాలేదు.

"సుక్కమ్మ లేదా సీతమ్మా?"

"ఉన్నాది"

"నువ్వు చూశావా?"

"లేదు"

"మరి రాదా?"

ఏం చెబుతుంది? — సీతమ్మకే తెలీదు సమాధానం.

ఇప్పుడేం చెయ్యాలి? అదే సీతమ్మను వేధిస్తున్న ప్రశ్న.

కోర్టుల గురించి సీతమ్మ విందిగాని, అక్కడి కార్యకలాపాలు — నాయ్యా న్యాయ విచారణలు — తీర్పులు మొదలైన వివరాలు బొత్తిగా తెలీవు. కోర్టులు, ప్లీడర్లూ వున్నది, కొంతమంది కోసమేగాని, పూటకి రికాణా లేని తమలాంటి వారందరి కోసమూ కాదని చాలామందిలా సీతమ్మ కూడా అభిప్రాయ పడింది.

"ఏం చేద్దారి మరి సీతమ్మా?" అన్నాడు దీనంగా, కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకున్న చంద్రయ్య.

ఏం చేసినా సీతమ్మే చెయ్యాలి మరి!

సీతమ్మకు తెలిసినంతవరకూ ఆ ఊళ్ళో కూలినాలి చేసుకు బ్రతికే తమలాంటి కుటుంబాల్లో ఏ గొడవ లొచ్చినా ఎప్పుడూ ఊరుదాటి పైకి పోవటమన్నది లేదు. గ్రామపెద్దలే సర్దుబాటు చెయ్యటం జరుగుతోంది.

కయ్యమైనా, వియ్యమైనా సమాన స్థాయిలో వారిలో అయితే అంతగా వెనకాడవలసిన పనిలేదు. స్థితిమంతుడూ, గ్రామపెద్దల్లో ఒకడూ అయిన కామయ్యతో కయ్యానికి సిద్ధపడటం నిజంగా సాహసమే! అయినా తప్పే దేముంది?

తనకు ఊహ తెలిసిందగ్గర్నుంచీ ఆ ఊళ్ళోనే వుంటోంది సీతమ్మ. ఎవరి వెనక ఎలాంటి కథ లున్నాయో ఆమెకు తెలుసు. అక్కడి మనుషులు, మనస్తత్వాలు, ప్రవర్తనలు, ప్రతి సంఘటనా ఆమెకు క్షుణ్ణంగా తెలుసు. ఇలాంటి సమస్య వచ్చినప్పుడు ఏం చెయ్యాలో,

ఎవర్ని పట్టుకోవాలో ఆమెకు బాగా తెలుసు. వచ్చిన చిక్కల్లా ప్రత్యర్థి కామయ్య కావటం!

భారం 'భగవంతుడి' మీద వేసి, చంద్రయ్యను తీసుకొని బయల్దేరేముందు తనకు తెలిసిన దేవుళ్ళందరికీ పేరు పేరున దణ్ణం పెట్టుకుంది. ఏడుకొండల ఎంకన్న బాబుకీ, సిమ్మాద్రి అప్పన్నకీ, అన్నారం సత్తిన్నారాయణకీ ప్రత్యేకంగా ముడుపులు కట్టింది.

ముందు పెద్దిరాజుగారి దగ్గరకెళ్ళింది.

అంతా విన్న తర్వాత సాలోచనగా "పెద్ద లందరికీ చెప్పావా?" అన్నాడు పెద్దిరాజుగారు.

"ఇంకా లేదు బాబూ! తొలీత మీ కాడికే వచ్చాను." అంది సీతమ్మ.

"సరే మిగిలిన వారిక్కూడా చెప్పి చూడు. తగువు సంగతి తర్వాత ఆలోచిద్దాం." అన్నాడు.

"అలాగే బాబూ!" అంటూ బయల్దేరింది సీతమ్మ.

చంద్రయ్య అనుసరించాడు.

కామయ్యమీద తగువు తెచ్చినందుకు ఎక్కడ తిడతారో పెద్దిరాజు గారని మొదట భయపడింది సీతమ్మ. కాని, ఆమె అనుకున్న ప్రమాదం జరగలేదు.

తర్వాత వరసగా బుచ్చినాయుడు, కుంటి కనకయ్య, పొట్టి భూమయ్య, గురివి శెట్టి వగైరాల యిళ్ళ క్కూడా వెళ్ళి, విషయం చెప్పి, తగువు పెట్టించమని చంద్రయ్య తరఫున అర్థించింది.

పెద్దరికం ప్రదర్శించుకోవటానికి వచ్చిన అవకాశం వదులుకోవటం ఎవ్వరికీ యిష్టంలేదు. కాని, కామయ్య పేరువిని కాస్త వెనకాడవలసి వచ్చింది.

సీతమ్మ అంత తేలిగ్గా వదిలే ఘటం కాదు, ఒకటికి పదిసార్లు కాళ్ళు అరిగేలా అందరి యిళ్ళకీ అదేపనిగా తిరిగింది. తిరగ్గా తిరగ్గా, వారంరోజుల తర్వాత తగువు తీర్చటానికి, పెద్దలందరూ కూడబలుక్కుని అంగీకరించారు.


* * *

పొద్దుగూకింది. చీకటికన్న వెన్నెలే ముందొచ్చింది. పక్కనే వున్న కాలవ మీదనుంచి చల్లని గాలి వీస్తోంది.

రామాలయం ముందు, మెట్లు వారగా తొంభైయేళ్ళ ముదివగ్గులా ముడుచుకొని కూచున్నాడు చంద్రయ్య. ఆ సమయంలో అతన్ని చూసినవారికి పాతికేళ్ళ పడుచు వాడంటే నమ్మకం కలగకపోవచ్చు.

ఇవ్వాళ తగువు తీరుస్తారు—అన్న వార్త సీతమ్మ చెప్పగా విని, మధ్యాహ్నమే వచ్చి కూచున్నాడు చంద్రయ్య.

ఆ ఊళ్ళో తగువులన్నీ రామాలయం ముందు, రాములవారి సమక్షంలోనే తీరుస్తారు. సాయంత్రం భోజనాలు ముగించి, తాపీగా చుట్టలు కాల్చి




కుంటూ వచ్చి, తీరిగ్గా వ్యవహారం నడుపుతారు పెద్దలు

ఆ సంగతి తెలిసుండీ, ఆతృత పట్టలేక, మధ్యాహ్నమే వచ్చి కూచున్నాడు చంద్రయ్య చీకటి పడుతూండగా సీతమ్మ వచ్చింది. ఆ వెనక గ్రామస్థులు ఒక్కొక్కరూ రాసాగారు.

గ్రామ పెద్దలకే కాక ఊళ్ళో ముఖ్యులైన వారందరికీ ఆ విషయం చెప్పింది సీతమ్మ. చిన్నా పెద్దా తారతమ్యం చూపకుండా ఎదురుపడ్డ వాళ్ళందరికీ కూడా వివరాలు చెప్పింది. అందుచేత ఏం జరుగుతుందో స్వయంగా చూడాలన్న కుతూహలంతో చాలామంది పోగుపడ్డా రక్కడ.

ఎనిమిది దాటుతూండగా గ్రామ పెద్దలు వేంచేశారు. అంతా కలిసి ఒక్కసారే రావటంవల్ల, అంతవరకు ఏ పెద్దిరాజుగారి యింట్లోనో సమావేశమై వస్తున్నారన్న సంగతి వూహ కందని విశేషమేమీ కాదు.

పక్కకి తొలగి పైకి వెళ్ళటానికి దారి యిచ్చారు జనం.

తిన్నగా వెళ్ళి తిన్నెపైన సుఖాసీను లయ్యారు పెద్దలు

పెద్దలు వచ్చారు.

చంద్రయ్య, సీతమ్మ అంతకు ముందే అక్కడున్నారు.

గ్రామస్థులూ చాలామంది వచ్చారు.

కామయ్య మాత్రం యింకా రాలేదు.

అంచేత కార్యక్రమం యింకా ప్రారంభింపబడలేదు.

తిన్నెపైన కూచున్న పెద్దలు గ్రామ రాజకీయాలు తాత్కాలికంగా మరచి, రాష్ట్ర, దేశ రాజకీయాల గురించి ముచ్చటించసాగారు.

జనంలో గుసగుసలు ప్రారంభమైనయి.

"కామయ్య యింకా రాలేదే!"

"వస్తాడంటావా?"

"అసలు వస్తా నన్నాడా?"

"అనే వుంటాడు. లేకపోతే పెద్దలంతా ఎందుకొస్తారు?"

"వచ్చినా ఏమవుతుంది లే— కామయ్యవి కాదని వాళ్ళేం చెబుతారు?"

"అంతే నంటావా?"

"కాక మరేమవుతుందనుకున్నావ్?"

"మనుషుల మొహాలుచూసి న్యాయం చెప్తే యింక ఈ తగువు లెందుకు? పెద్ద లెందుకు? తీర్పు లెందుకు?"

"లోక వ్యవహారం నాయనా! లోకుల కళ్ళు కప్పటానికి, నోళ్ళు మూయించటానికి కొన్ని పద్ధతులు అవలంబించాలి. తప్పదు."

"కాని, ఈ రోజు నువ్వన్నట్టు జరగదని నా వుద్దేశ్యం."

"ఎంచేత?"

"కామయ్యంటే పెద్దిరాజుకి పడదు. గురివిశెట్టికీ పడదు. ఊళ్ళో చాలా మందికి అతనంటే గిట్టదు."

"వాళ్ళల్లో వాళ్ళకి సవాలక్ష వ్యవహారాలుండవచ్చు. కాని, వాళ్ళంతా ఒక్కటే! సెంద్రిగాడికి మేలు చేస్తే వాళ్ళకేమొస్తుంది? ఇవ్వాళ పార్టీలు వేరైనా అవసరం వస్తే అందరూ ఏకమై పోతారు మళ్ళీ."

"ఇంతకీ ఈ కామయ్య రాడే:"

"వస్తాళ్ళే, అయనా పెద్దమనిషేగా!"

"పెద్దమనిషే. కాదని ఎవరన్నారు? వయసు మళ్ళినా వంకర బుద్ధులు మాత్రం పోలేదు. పచ్చని సంసారాల్లో నిప్పులు పోస్తున్నాడు. ఇలాంటివాడు ఊరికొక్కడుంటే చాలు—పెళ్ళాలున్న మొగాళ్ళకి మనశ్శాంతి లేకుండా పోతుంది. ఇవ్వాళ సెంద్రిగా దయ్యాడు. రేపు మరొకడవుతాడు!"

"ఆ 'మరొకడు' నువ్వే ఎందుక్కాకూడదు?"

"నేనూ కావచ్చు. నువ్వూ కావచ్చు."

ఎనిమిదిన్నర దాటుతుంది. కామయ్య రాలేదు.

జనం కుతూహలం పట్టలేక పోతున్నారు.

పెద్దలు, అసలు విషయం మర్చిపోయి, రాజకీయ చర్చలో మునిగి పోయినట్లు కనిపిస్తున్నారు.

సీతమ్మ క్షణానికో దేవుణ్ణి తలుచుకొంటోంది.

చంద్రయ్య నిర్నిమేషంగా పెద్దల వేపు చూస్తున్నాడు.

తొమ్మిది సమీపిస్తూండగా కామయ్యగారి బావమరది వచ్చాడు. పెద్దిరాజుగార్ని పక్కకు పిలిచి, చెవిలో ఏదో చెప్పి, వెంటనే మళ్ళీ వెళ్ళిపోయాడు.

పెద్దిరాజుగారు మిగిలిన పెద్దలతో రహస్యంగా సంప్రదించి, గొంతు

సవరించుకొని, సభాసదుల్ని నిశ్శబ్దంగా వుండవలసిందిగా విజ్ఞప్తిచేశారు.

అంతా నిశ్శబ్దం.

"కామయ్యగారికి సుస్తీగా వుందట. అంచేత యిక్కడికి రాలేనని కబురు చేశారు. ఆయన రాకపోయినా ఈ కార్యక్రమం వాయిదా వెయ్యక్కర్లేదనీ, మేము ఏ తీర్పు చెప్పినా ఆయన తప్పక అంగీకరిస్తాననీ కూడా వారి బావమరిదితో కబురు చేశారు. అంచేత, యింతవరకూ వచ్చింతర్వాత వాయిదా వెయ్యటం కూడా అంత బావుండదు కనుక, సభ ప్రారంభిద్దాం" అనేశారు పెద్దిరాజుగారు.

"ఆయన మాటను కాదనే ధైర్యం ఆ సభలో ఎవ్వరికీ లేదు. అలాంటిదేమన్నా జరిగితే తిన్నెపైకూచున్న పెద్దల నుండే జరగాలి. కాని, వాళ్ళు ఎప్పుడో పచ్చజెండా వూపేశారు.

సభ ప్రారంభమైంది.

అక్కడక్కడ గుసగుసలు ప్రారంభమైనయ్.

"కామయ్య రాకుండా కామయ్యమీద తగువు చెపుతారా? ఎన్నడైనా జరిగిందా యిలాంటి చిత్రం ఊళ్ళో! అదే నువ్వో నేనో అయితే ఒప్పుకుంటారా ఈ పెద్దలు?"

"నువ్వూ కామయ్యలా యిరవై ఎకరాలు సంపాదించవోయ్ వాళ్ళే ఒప్పుకుంటారు."

"చుక్కమ్మని గూడా పంపలేదు!"

"చుక్కమ్మ యిప్పుడు కామయ్య మనిషి! పదిమందిలోకి ఎలా వస్తుంది?"

"అలాగే వుంది చూడబోతే!"

సభ దారి సభదీ, జనం దారి జనందీగా వుంది.

"సెంద్రిగా డొచ్చాడా?" పెద్దిరాజుగారడిగారు గొంతు పెద్దదేసి.

"ఇదుగోండి బాబూ! యిక్కడే వున్నాడు." అంది సీతమ్మ,

చంద్రయ్య లేచి చేతులు కట్టుకు నిలబడ్డాడు. ఒళ్ళు తూలింది. సీతమ్మ పట్టుకొని కూచోబెట్టింది.

"ఏమైంది?" ఆతృతగా అడిగారు పెద్దిరాజుగారు.

"పదిరోజులబట్టీ దారకంలేదు బాబూ! సీరసపడిపోయినాడు బిడ్డ!" అంది సీతమ్మ.

'జబ్బేమిటి?' అని ఆయన అడగలేదు. 'ఆహా! అలాగా!' అన్నారు. 'జాగ్రత్తగా కూచోబెట్టు. కూచోలేకపోతే పడుకోమను ఫర్వాలేదు' అని గూడా అన్నారు ఎంతో వుదారంగా.

తర్వాత పెద్దిరాజుగారు, మిగిలిన పెద్దలు ఎన్నో ప్రశ్నలడిగారు. అన్నింటికీ చంద్రయ్యతరపున సీతమ్మే జవాబు చెప్పింది.

చంద్రయ్య తరపున సీతమ్మ కోరింది ఒక్కటే— 'సుక్కమ్మ సెంద్రిగాడి భార్య. దాన్ని అడికిప్పించండి!'

పరాయివాడి పెళ్ళాన్ని యింట్లో పెట్టుకున్న నేరానికి కామయ్యకు శిక్ష (తప్పు) వెయ్యమని సీతమ్మ కోరలేదు. కామయ్యకు శిక్షవేస్తే చంద్రయ్యకేం లాభం?

సీతమ్మ ధోరణి గ్రామస్థుల్లో చాలా మందికి నచ్చలేదు.

నేరంచేసినవాడికి శిక్ష వెయ్యకపోతే యింక వీళ్ళు చెప్పే తీర్పు ఏముంటుంది? చుక్కమ్మ సెంద్రిగాడి పెళ్ళాం. వాడి సొత్తు వాడికిప్పించటంతో తగువు చెప్పటం పూర్తయిపోతుందా? దొంగిలించిన సొమ్ము స్వంతదారునికిచ్చేసి, దొంగను వూరికెనే వదిలేసినట్టుటుంది. ఇదేనా న్యాయం?—యిది ప్రజాభిప్రాయం.

గ్రామపెద్దల్లో కూడా తర్జనభర్జనలు ప్రారంభమైనట్టు కనిపిస్తున్నాయ్.

సీతమ్మ కోరిన కోరిక అసమంజసమైనదీ, అసాధ్యమైనదీ కాదు. ఆ మాట కొస్తే ఆమె అభ్యర్థనమేరకు తీర్పుచెప్పి ముగిస్తే, అది నిజమైన తీర్పు అనిపించుకోదు కూడా! గ్రామస్థులు హర్షించరు.

కామయ్య చేసింది తప్పే. కాదని ఎలా అనగలం? సెంద్రిగాడికి జరిగింది అన్యాయమే. అదీ కాదనలేం. కరవమంటే కప్పకు కోపం. విడవమంటే పాముకు కోపం. ఈ కామయ్య ఎప్పుడూ యింతే. ఏదో ఒక గొడవ తెచ్చిపెడుతుంటాడు. సర్దుకోలేక మనం తలలు బద్దలు కొట్టుకోవాల్సి వస్తోంది.

గ్రామపెద్దలు అంతగా సతమతం అవటానికి కారణం సమస్యను పరిష్కరించటం చేతకాక కాదు. ఇలాంటి తగువులెన్నో యిదివరకు నిమిషాలమీద పరిష్కరించారు వాళ్ళు. ఇప్పుడు వచ్చిన చిక్కంతా కామయ్యతోనే.

నిజానికి ఈనాటి తగువును ఎలా ముగించి తీర్పు చెప్పాలో వాళ్ళెప్పుడో నిర్ణయించుకొని వున్నారు. అయితే ఆ తీర్పు యిరుపక్షాలవారికే కాకుండా, గ్రామస్థులందరికీ కూడా సంతృప్తికరంగా వుండాలి. లేకపోతే తమ పెద్దరికానికే భంగం వాటిల్లుతుంది. అదిమాత్రం జరగటానికి వీల్లేదు. అందుచేతే యింతగా తటపటాయించవలసి వస్తోంది.

పెద్దిరాజుగారు "సీతమ్మా!" అని పిల్చారు.

"బాబూ!" అనేసింది సీతమ్మ.

"సెంద్రిగాడికి పెళ్ళయి ఎన్నాళ్ళైయ్యింది?"


"అర్నెల్లవుతాది బాబూ!"

"వాళ్ళిద్దరూ అన్యోన్యంగా వుంటూండేవారా? లేక చీటికీ మాటికీ కీచులాడుకొనేవాళ్ళా?"

"సిలకా గోరింకల్లా వుండేవోరు బాబూ!"

"మరి యింత ఘోరం ఎలా చేసిందంటావ్ చుక్కమ్మ?"

"చుక్కమ్మ చేసివుండదు ఘోరం.




ఏంచేసినా కామయ్యే చేసివుంటాడు. ఈ ఊళ్ళో ఎంతమంది సంసారస్త్రీలని అతను బలవంతం చెయ్యలేదు? ఎంతమందిచేత చెప్పుదెబ్బలు తినలేదు! ఆస్తి, అంతస్థు చూపించి కొందర్ని లోబర్చుకొంటున్నాడు. భయపెట్టి కొందర్ని లొంగదీసుకొంటున్నాడు. అప్పుడప్పుడు కొందరు ఎదురుతిరిగి, బుద్ధిచెప్తున్నా కుక్కతోక లాంటి అతని వంకరబుద్ధిమాత్రం మంచిదారివేపు మళ్ళటంలేదు. మీరిలాగే చూస్తూ మరికొంతకాలం వుపేక్షించి వూరుకుంటే, మీ సంసారాల్లో చిచ్చుపెట్టటానిక్కూడా అతను వెనుకాడడు. ఇది నిజం!"

ఈ మాటలన్నీ అన్నది సీతమ్మ కాదు. జనంలోంచి ఒక కుర్రాడు లేచి వుద్రేకంగా అన్నాడు. అన్నది కుర్రాడే అయినా అవన్నీ కుర్రతనపు మాటలుగా కొట్టిపారెయ్యలేకపోయారు పెద్దిరాజుగారు. కారణం అవన్నీ పచ్చి నిజాలు. ఆ సంగతి తనకీ, మిగిలిన పెద్దలకీ, ఊళ్ళో యావన్మందికీ తెలుసు. అంచేతే తన పెద్దరికాన్ని సమర్థించుకొనే వుద్దేశ్యంలో "మా దృష్టిలోకి వచ్చిన ఏ విషయాన్నీ మేము వుపేక్షించటం యింతవరకు జరగలేదు. ఇకముందు జరగదు కూడా. మా పెద్దరికాన్ని మీరు గౌరవించినన్నాళ్ళు అలాంటి ప్రమాదం జరగదని గ్రామపెద్దలందరి తరవున నేను హామీయిస్తున్నాను." అన్నారు పెద్దిరాజుగారు.

పెద్దిరాజుగారి భక్తులు కొందరు చప్పట్లు కొట్టారు. పక్కవారు కొడుతున్నప్పుడు తాము కొట్టకపోతే

బావుండదని సభ్యతకోసం మరికొందరు కొట్టారు. విషయమేమిటో తెలీకపోయినా నలుగురితోపాటు నారాయణా అన్నట్టు యింక కొందరు చేతులు కలిపారు.

చప్పట్ల హోరు తగ్గింతర్వాత, పుంజుకున్న వుత్సాహంతో "సీతమ్మా" అన్నారు పెద్దిరాజుగారు.

"బాబూ!" అనేసింది వెంటనే సీతమ్మ.

"సెంద్రిగాడి పెళ్ళి ఏ ఊళ్ళో జరిగింది?"

"ఈ ఊళ్ళోనే బాబూ!"

"పెళ్ళప్పుడు నువ్వు దగ్గిరే వున్నావా?"

"నానేగదా బాబూ ఆడి పెళ్ళి సేసింది!"

"అలాగా! పెళ్ళికి ఏమాత్రం ఖర్చైందంటావ్?"

"దగ్గిరదగ్గిర నాలుగొందలయ్యుంటాది బాబు!"

"అంతే!"

"సిత్తం. పేదోళ్ళ పెళ్ళికి అంతకన్న ఎక్కువెందుకు బాబూ? అదే ఎక్కువ కింద లెక్క!"

"సరి సరే, నువ్వెంతో కష్టపడి సెంద్రిగాడికి పెళ్ళి చేశావు, కాని, చుక్కమ్మ లేచిపోయింది!"

"చుక్కమ్మ లేచిపోలేదు. కామయ్యే చుక్కమ్మను లేపుకు పోయాడు." మళ్ళీ యిందాకటి కుర్రాడే అన్నాడు.

"ఎలా అనుకున్నా ఒక్కటే. రెండు చేతులూ కలవందే చప్పట్లు వినిపించవు. చుక్కమ్మ సెంద్రిగాన్ని వదిలి ప్రస్తుతం కామయ్య దగ్గిరవుంది. మొగుణ్ణి వదిలి కొంతకాలం పరాయివాడి దగ్గరవున్న చుక్కమ్మను బలవంతాన తీసుకొచ్చి, మళ్ళీ సెంద్రిగాణ్ణి ఏలుకోమనటం ఏం బావుంటుంది? కనక...."

ఈ పాయింట్ సీతమ్మకి నచ్చలేదు. ఎందేతనంటే రావణాబ్రెమ్మ చెరపట్టిన సీతమ్మవారు అంతకాలం లంకలో వున్నా తర్వాత తెచ్చి శ్రీరామచంద్రుల వారు ఏలుకున్నారు! అంతదూరం ఎందుకు—ఈ పెద్దిరాజుగారే తన కూతురు పెళ్ళయిన ఏడాది తిరక్కముందే మొగుణ్ణొదిలి ఎవడితోనో లేచిపోతే వెదికి తీసుకొచ్చి, అల్లుడి కాళ్ళా వేళ్ళాబడి, కట్నంగాక మరో రెండెకరాల పొలం అదనంగా ముట్టచెప్పి ఆ సంసారం చక్కదిద్దారు!

"సెంద్రిగాడు అదే కావాలంటున్నాడు బాబూ! అదంటే ఆడికి పేణం బాబూ!" అంది వినయంగా సీతమ్మ.

పెద్దిరాజుగారు యిబ్బందిలో పడ్డారు. కొంచెం కోపం కూడా వచ్చింది. అయినా తమాయించుకున్నాడు.

తన్ను పూర్తిగా మాట్లాడనివ్వరే అసలు?....

"చూడు సీతమ్మా! మీకు న్యాయం చెయ్యాలన్నదే మా ఉద్దేశ్యం. చుక్కమ్మ వీణ్ణి కాదని లేచిపోయింది. వాడింకా

అదే కావాలని పట్టుబట్టి కూచోవటం మూర్ఖత్వం అనిపించుకొంటుంది!"

"పిలకా గోరింకల్లా వుండే రోజులు బాబూ మరి!"

"అది ఒకప్పటి మాట! ఇప్పటి సంగతాలోచించు. అది లేచిపోయింది. చెడిపోయింది. ఇంకా వీడికేం పని? వీడు మగ మహారాజు. తలుచుకుంటే రేపీపాటికి మళ్ళీ పెళ్ళిచేసుకోగలడు!"

"పాపం కామయ్య మగాడు కాడు కాబోలు. చుక్కమ్మ పోతే మరో మనిషిని సంపాదించుకోలేడు!" అనుకొంటూ విసుగ్గా అక్కణ్ణుంచి లేచిపోయాడు కుర్రాడు.

పెద్దిరాజుగారు అది విననట్టే నటించి తన మాట కొనసాగించారు. "అంచేత నా మాట విను. రెండు చేతులు కలిస్తేనే గాని చప్పట్లు రావని యిందాక నేను చెప్పినట్టు, కామయ్యతో పాటు చుక్కమ్మ తప్పుచేసింది. నష్టపోయింది మాత్రం సెంద్రిగాడు. అంచేత సెంద్రిగాడికి నష్ట పరిహారం యిప్పించాలి. అదే న్యాయంగా ఉంటుందని మా అభిప్రాయం."

సీతమ్మకేం చెప్పాలో తోచలేదు.

జనంలో గుసగుసలు ఎక్కువైనయ్.

పెద్దిరాజుగారు, మళ్ళీ అందుకున్నారు. "సెంద్రిగాడి పెళ్ళికి సుమారు నాలుగు వందలు ఖర్చైందని యింతకుముందు నువ్వే చెప్పావు. ఆ నాలుగువందలకీ మరో వంద కలుపు - మొత్తం ఐదు వందలు - కామయ్యతో యిప్పిస్తాం. వెంటనే మరో పిల్లను చూసి ఘనంగా పెళ్ళి చేసెయ్ సెంద్రిగాడికి. ఏమంటావ్?"

ఏమంటుంది సీతమ్మ? ఏమీ అనలేదు. అనలేకపోయింది.

జనంలోంచి గుసగుసలు వినిపిస్తున్నయ్ తప్ప స్పష్టంగా ఒక్క మాట గూడా వినిపించటంలేదు.

ఇందాకటి కుర్రాడుంటే ఏమనేవాడో!

"ఎందుకైనా మంచిది ఒకసారి సెంద్రిగాడిక్కూడా చెప్పిచూడు." అన్నారు పెద్దిరాజుగారు.

"ఏమంటావురా సెంద్రిగా?" అంది సీతమ్మ.

"సుక్కమ్మ నాకాడికి రానంటందా?"

నూతిలోంచి వచ్చినట్టున్న సెంద్రిగాడి మాటలు పెద్దిరాజుగారికి వినిపించలేదు. సీతమ్మకు వినిపించినా ఆమె దగ్గర సమాధానం సిద్ధంగాలేదు. ఒకప్పుడు సీతమ్మే ఆ ప్రశ్న వేసుకుంది. చుక్కమ్మ తప్ప మరొకరు సమాధానం చెప్పలేని ప్రశ్న అది. చుక్కమ్మ కనిపిస్తేగా!

"అది రాదు. ఇంక దాని వూసెత్తకు" అంది సీతమ్మ బాధగా, చిరాగ్గా.

సుక్కమ్మే రానప్పుడు యింక మిగిలిన విషయాలు నా కనవసరం— అన్నట్టు మౌనంవహించాడు చంద్రయ్య.

ఇంక చేసేదిలేక "అయిదొందలు

ఎప్పుడిస్తారు బాబూ! రేపు కనపడమంటారా?" అంది సీతమ్మ వినయంగా.

'అమ్మయ్య!' అనుకున్నారు పెద్దిరాజుగారు. కొండంత బరువు తల మీదనుంచి దింపుకున్నంత హాయి కలిగిందాయనకి. సగర్వంగా చిరునవ్వు చిందిస్తూ, ఒక్కసారి మిగిలిన పెద్దలందరి వంకా చూశారు.

"పిల్లను చూసి నాదగ్గరకి రా. వెంటనే కామయ్యతో అయిదొందలూ యిప్పించేస్తాను. ఈ క్షణంలో మీకివ్వటానికి మాకెలాంటి యిబ్బంది లేదుగాని, మీదగ్గిర డబ్బు నిలవదు. అనవసరంగా ఖర్చుపెట్టేస్తారు. రేపు వాడికి పిల్ల కుదిరినాక పెళ్ళిచెయ్యటం కష్టమైపోతుంది. నష్టపరిహారంగా యిస్తున్న ఈ డబ్బు కేవలం వాడి పెళ్ళిఖర్చుల కోసమని! అంచేత అది పెళ్ళి సందర్భంలో యివ్వటమే న్యాయంగా వుంటుంది. కామయ్యకి అయిదొందలంటే అంత లెక్కలోని మొత్తం కాదు. ఏ క్షణంలో అడిగినా యివ్వగలడు. అత నివ్వలేకపోతే నే నిస్తాను. సరా?"

పెద్దిరాజుగారు 'సరి' అంటే అంతా సరే. ఆ మాటకు తిరుగులేదు.

పెద్దలు గద్దెదిగారు. జనాలు బయల్దేరారు. రామాలయం ఖాళీ అయిపోయింది.

సెంద్రిగాడు, సీతమ్మ మిగిలారు.

వెన్నెల్ని చీకటి మింగేసింది

చుక్కమ్మ లేని సెంద్రిగాడి బతుక చీకటైపోయింది. గాలి స్తంభిం పోయింది. ఆకాశం మేఘావృతమైంది సెంద్రిగాడి పరిస్థితికి జాలిపడి ప్రకృ కన్నీళ్ళు వర్షించింది.

హోరున కురుస్తున్న వానలో తడి ముద్దయిపోయాడు చంద్రయ్య. వా నీటిలో అతని కన్నీరు కరిగిపోయింది గాలి హోరులో అతని రోదనం కలి పోయింది.

"వానెక్కువై పోనాది రారా సెంద్రిగ యింటికెళ్ళిపోదారి." అంటూంది సీతమ్మ

"నేనాయింటికి రాను, సీతమ్మ రాలేను. ఇక్కడే - ఈ వానలో - ఈ గుడి ముందు - ఈ శీరామసెందురు కాళ్ళముందు తల బద్దలుకొట్టుకొని సచి పోతాను నువ్వెల్లిపో."

దుఃఖాన్ని ఆపుకోలేక పొర్లి పొ ఏడుస్తున్నాడు చంద్రయ్య.

సీతమ్మ కేమీ పాలుపోలేదు. నిజం చచ్చిపోతాడేమో అన్న భయం కలిగిం

"ఇదెక్కడి కరమొచ్చి పడింది నాకు బగమంతుడా!" అంటూ తన గుండెబాదుకొంటూ రోదించసాగింది.